క్లుప్తంగా

గరిష్ట వేతనం పొందేలా పని చేయాలి



బ్రాహ్మణదొడ్డిలో ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న ఏపీడీ అల్లిపీర

సి.బెళగల్: ఉపాధి కూలీలు నిర్దిష్ట కొలతల ప్రకారం పనిచేస్తే రోజువారీ గరిష్ట వేతనం రూ.300 పొందవచ్చని ఏపీడీ అల్లిపీర అన్నారు. ఆయన మంగళవారం మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో ఉపాధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ.. సమయపాలన పాటించి, కొలతల ప్రకారం పనులు చేసుకుని, రోజువారి గరిష్ట వేతనం రూ.300 పొందాలన్నారు. అదేవిధంగా వలసల నివారణకు గ్రామాల్లో అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించడం జరుగుతుందని, పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధిహామీ ఈసీ రంగస్వామి, టీఏ రామ్‌శంకర్, ఎఫ్‌ఏలు, మేటీలు ఉన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ

కర్నూలు(రూరల్): నగర సమీపంలోని వెంకాయపల్లెలో వెలసిన ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. అమ్మవారికి గుగ్గిళ్లు, భక్షాలు, పిండి వంటలు నైవేద్యంగా సమర్పించి మొక్కుకున్నారు. కొందరు భక్తులు మొక్కుబడిలో భాగంగా కుంకుమార్చన, ఆకుపూజ తదితర పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

కొత్తూరులో ఘనంగా కలశ పూజలు



కొత్తూరులో కలశ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో సుబ్రమణ్యేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం మహాకుంభాభిషేకం, రాజగోపురం కలశ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆలయ ఈఓ రామకృష్ణ, అర్చకులు నారాయణస్వామి, సురేష్ శర్మ, కుంభాభిషేక నిర్వాహకులు పుల్లేటకుర్తి భోగేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. కలశ ప్రతిష్ఠకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేడుక సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

కోలుకోలేక బాలుడి మృతి



మృతిచెందిన రామ్‌చరణ్

సి.బెళగల్: పాము కాటుకు గురై చికిత్స పొందుతున్న బాలుడు కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ పరమేష్‌నాయక్ తెలిపారు. ఘటన వివరాలను ఆయన వెల్లడిస్తూ.. మండలంలోని పోలకల్ గ్రామానికి చెందిన గంపరాజు వెంకటేశ్వర్లు కుమారుడు రామ్‌చరణ్ (7) ఇంట్లో నిద్రిస్తుండగా, ఈనెల 14వ తేదీన పాముకాటుకు గురయ్యాడు. ఆ బాలుడిని కర్నూలు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తుండగా కోలుకోలేక మంగళవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

22న హనుమాన్ జయంతి



మాట్లాడుతున్న సమితి అధ్యక్షుడు క్రిష్టన్న

కర్నూలు కల్చరల్: సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 22న హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు కె.క్రిష్టన్న తెలిపారు. ఆయన మంగళవారం వినాయక్ ఘాట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. హనుమాన్ జయంతితో పాటు ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్ మైదానంలో సాయంత్రం 5.30 గంటల నుంచి వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. రామాయణ పారాయణం, ధార్మిక ప్రసంగాలు, వెయ్యి మందితో హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, హిందూ బంధువులు వేడుకల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, ఉపాధ్యక్షుడు మహాబలేష్, నారాయణరెడ్డి, కోశాధికారి మురళి, సభ్యులు పాల్గొన్నారు.

పని చేయని చేతిపంపులు



బి.తాండ్రపాడు బీసీ కాలనీ మసీదు వద్ద నిరుపయోగంగా చేతిపంపు

కర్నూలు(రూరల్): అసలే వేసవి కాలం.. భూగర్భ జలాలు అంతత మాత్రమే.. నీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన చేతిపంపులు మరమ్మతులకు గురికాగా వాటిని అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. కర్నూలు మండల పరిధిలోని బి.తాండ్రపాడు బీసీ కాలనీ మసీదు సమీపాన, పసుపల గ్రామ బిల్డింగ్ కాలనీలో ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన చేతిపంపులు నిరుపయోగంగా మారాయి. ఒకప్పుడు కాలనీ వాసులు ఈ చేతిపంపుల నీటినే తాగేవారు. కుళాయిలకు నీరు సరఫరా గాకపోతే చేతిపంపుల నీరే ఆధారం. ఇదిలాఉండగా చేతిపంపులు మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. చుట్టుపక్కల వారి నీటి అవసరాలు, మసీదులో ప్రార్థనలకు వెళ్లే వారికి నీటి అవసరం తీర్చే చేతిపంపులను వెంటనే బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



పసుపుల గ్రామంలో మరమ్మతులకు గురైన చేతిపంపు

రహ'దారి'ద్ర్యం



అధ్వానంగా ఉన్న రోడ్డు

కర్నూలు(రూరల్): దిన్నెదేవరపాడు గ్రామ సమీపం నుంచి బి.తాండ్రపాడు పరిధిలోని ఆర్డీఓ ఆఫీసుకు వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణం చేసే వారికి నరకం కనిపిస్తోంది. ఈ రహదారిపై నిత్యం ఎంతో మంది దిన్నెదేవరపాడు నుంచి బి.తాండ్రపాడు మీదుగా నంద్యాల హైవే రోడ్డుకు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రివేళలో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు ప్రమాదాల బారిన పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. రోడ్డును పంచాయతీరాజ్ అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోపోవడంతో తారు లేచిపోయి, కంకర రళ్లు తేలి అడుగడుగునా గుంతలు పడ్డాయి. గుంతలమయంగా మారిన రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారిందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

'పీఎం కుసుమ్'కు భూముల పరిశీలన



అలమూరులో భూములను పరిశీలిలిస్తున్న ఆర్డీఓ విశ్వనాథ్

పాణ్యం: పీఎం కుసుమ్ పథకం కింద ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్‌కు సంబంధించి భూములను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. మంగళవారం అలమూరు గ్రామ సమీపంలో ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ వద్ద ఈ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు అధికారులు స్థలాన్ని కేటాయించారు. నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌రెడ్డి, సిబ్బంది భూములను పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ పీఎం కుసుమ్ పథకం కింద ఏపీఎస్‌పీడీసీఎల్ వారు ప్లాంట్ ఏర్పాటుకు దరఖాస్తు చేశారన్నారు.

ఈ-శ్రమ్ కార్డులను సద్వినియోగం చేసుకోండి



కూలీలకు అవగాహన కల్పిస్తున్న కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ బాలునాయక్

కోడుమూరు రూరల్: కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందజేస్తున్న ఈ-శ్రమ్ కార్డులను ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ బాలునాయక్ సూచించారు. మండలంలోని అమడగుంట్ల గ్రామంలో మంగళవారం జాయింట్ కమిషనర్ బాలునాయక్, డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, అసిస్టెంట్ జిల్లా లేబర్ ఆఫీసర్ కేశన్న పర్యటించి ఉపాధి కూలీలకు ఈ-శ్రమ్ కార్డులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ.. కూలీలంతా ఈ-శ్రమ్ కార్డులను తీసుకోవాలని, ఈ కార్డుల ద్వారా కూలీలకు ఉచితంగా ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. కూలీలు, కార్మికులందరికీ ఈ-శ్రమ్ కార్డులను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, కార్డుల నమోదు కోసం ఉపాధి మేటీలకు సైతం అవగాహన కల్పించడం జరిగిందని, కూలీలంతా ఆయా మేటీల వద్ద కార్డులకు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. సర్పంచు వరలక్ష్మి, ఏపీఓ మోదీన్‌బాషా, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వే పకడ్బందీగా చేపట్టాలి



బ్రాహ్మణదొడ్డిలో రీసర్వేపై అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సందీప్

సి.బెళగల్: గ్రామాల్లో భూముల రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలని కర్నూలు ఆర్డీఓ సందీప్ సూచించారు. ఆయన మంగళవారం సి.బెళగల్ మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి రెవెన్యూ గ్రామ పరిధిలో మండల అధికారులు నిర్వహిస్తున్న రీసర్వేను తనిఖీ చేశారు. గ్రామంలో బ్లాక్ నంబర్ 5లో సర్వే బృందం చేపట్టిన భూముల సర్వేను తనిఖీ చేసి, వివరాలను అక్కడి అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే రెవెన్యూ గ్రామ పరిధి మ్యాప్, భూముల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ.. సర్వే అధికారులు సంబంధిత రైతుల సమక్షంలో భూముల కొలతలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి సమస్యలు ఎదురవకుండా పకడ్బందీగా సర్వే నిర్వహించాలని సూచించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం, సర్వే డీటీ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ నాగభూషణం, సర్పంచ్ దస్తగిరి, వీఆర్వోలు, సర్వే సహాయకులు, రైతులు ఉన్నారు.

నేడు బెస్త ముఖ్య నేతల సమావేశం

కర్నూలు(అర్బన్): అఖిల భారత బెస్త మహాసభ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉదయం 10 గంటలకు ఉమ్మడి జిల్లా ముఖ్య నేతల సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర కో-కన్వీనర్ సాయి ప్రదీప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని డాక్టర్ బ్రహ్మరెడ్డి ప్రజా వైద్యశాల ప్రాంగణంలో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బెస్తలకు రాజకీయంగా అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు అవలంభిస్తున్న వైఖరిపై సమావేశంలో చర్చించనున్నట్లు వెల్లడించారు.

హిందీ పరీక్షకు 9 మంది గైర్హాజరు

సి.బెళగల్: మండలంలో జరుగుతున్న పదో తరగతి హిందీ సప్లిమెంటరీ పరీక్షకు 9 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల అధికారులు తెలిపారు. స్థానిక మోడల్ స్కూల్లో రెండవ రోజు 12 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 6 మంది మాత్రమే హాజరయ్యారు. మిగతా ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ చీఫ్ అధికారి ధనుంజయగౌడ్ తెలిపారు. అదే విధంగా సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 మంది విద్యార్థులు హిందీ పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా ఐదుగురు మాత్రమే హాజరవగా, ముగ్గురు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి వెంకటరమణ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

కల్లూరు/గడివేములు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆపార్టీ కేంద్ర కార్యాలయం మండల కమిటీలను నియమించింది. మంగళవారం పాణ్యం నియోజకవర్గ పరిధిలో గడివేముల, పాణ్యంకు మండల కమిటీలను ప్రకటించింది. గడివేముల మండలానికి సంబంధించి కమిటీ వైస్ ప్రసిడెంట్లుగా మిట్టమీది పెద్ద దాలుస్వామి, అనిల్‌కుమార్‌రెడ్డి, జనరల్ సెక్రటరీలుగా వెంకటక్రిష్టారెడ్డి, బండపల్లె రమేష్, గోదా ప్రసాద్, షారూక్‌ఖాన్, ట్రెజరర్‌గా జమాల్ బాషా నియమితులయ్యారు. సెక్రటరీలుగా రామలింగేశ్వరరెడ్డి, సురేష్, ఎల్లారెడ్డి, మాగేనాయక్, శ్రీనివాసులతో పాటు 20 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఉన్నారు. అలాగే పాణ్యం మండల కమిటీకి వైస్ ప్రసిడెంట్లుగా కె.వీరయ్య, ఎం. హుస్సేన్ సాహెబ్, జనరల్ సెక్రటరీలుగా బి. ఎల్లాగౌడ్, డి. ఎల్లా పరమేశ్వర రెడ్డి, యు. విజయ్ భాస్కర్, జె. వెంకట సుబ్బారెడ్డి, ట్రెజరర్‌గా ఎన్వీ రమణ, సెక్రటరీలుగా ఆర్.ఎస్.అజ్మతుల్లా, ఎ. అశోక్ కుమార్ రెడ్డి, జి. వెంకట సుబ్బయ్య, ఎస్. రామసుబ్బారెడ్డి, డి. చంద్రనాయక్‌ను నియమించారు. మరో 20 మంది కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్): నగరంలోని బి.క్యాంపు క్రీడా మైదానంలో మంగళవారం సాయంత్రం వాలీబాల్ ఇన్విటేషన్ టోర్నమెంటు అండర్-14 బాలబాలికల పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉన్నత విద్య అధ్యయన కేంద్రం ప్రిన్సిపాల్ కె.వి.మధుసూదన్ మాట్లాడుతూ.. చిన్నతనం నుండే విద్యార్థులకు ఇటువంటి పోటీలు నిర్వహించడం ద్వారా భవిష్యత్తులో రాటుదేలిన క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకుంటారన్నారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సభ్యుడు షరీఫ్ అహమ్మద్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కోడుమూరులో నిరసన తెలుపుతున్న సీపీఐ, సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు



గూడూరులో నిరసన తెలుపుతున్న సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు

కోడుమూరు రూరల్: రైతులు పండించిన ప్రతి పంటకు మద్దతు ధర ప్రకటించాలని, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు బి.రాజు, కె.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికై చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం కోడుమూరులోని కోట్ల సర్కిల్‌లో సీపీఐ, సీపీఎం, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతుల సంక్షేమానికి విరుద్ధంగా నల్ల చట్టాలను చేస్తోందని ఆరోపించారు కేంద్రం ప్రవేశపెడుతున్న చట్టాల వల్ల దేశంలో రైతులు, కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని, గ్రామాల్లో పనులు లేక రైతులు, కూలీలు వలస బాట పట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కార్మికుల కడుపుకొట్టే చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ, సీపీఎం స్థానిక నాయకులు రాముడు, వీరన్న, పంచాయతీ, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ఆటో కార్మికులు, రైతు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక, ప్రజా సంఘాల నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్, మండల అధ్యక్షుడు గుంటప్ప మాట్లాడుతూ.. కార్మికులు ప్రాణత్యాగం చేసి సాధించుకున్న చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు ప్రభావతి, మద్దిలేటి, సుజాత, శేషమ్మ, శాంతన్న, మధు, సుంకన్న, రత్నమ్మ, సునంద, రామలక్ష్మి, కళావతి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణకు నోచుకోని వాటర్ ట్యాంకులు



బి.తాండ్రపాడులో నీటి ట్యాంకు చుట్టూ పెరిగిన కంప చెట్లు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని బి.తాండ్రపాడు, సూదిరెడ్డిపల్లె, దిగువపాడు గ్రామాల్లో ప్రజలకు మంచినీరు అందించేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకులను గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో అపరిశుభ్రంగా మారాయి. బి.తాండ్రపాడులో ఎంపీపీ స్కూల్ సమీపంలోని నీటి ట్యాంకు వద్ద ఒక కుళాయి మరమ్మతులకు గురైంది. మరోపక్క ట్యాంకు చుట్టూ కంప చెట్లు పెరగడం వల్ల విష పురుగులు సంచరిస్తున్నాయని కాలనీ వాసులు వాపోయారు. ఇదే గ్రామంలో ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లే దారిలో వాటర్ ట్యాంక్ పెచ్చులు ఊడిపోవడంతో పాటు ట్యాంకు పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. ఒక కుళాయి మరమ్మతులకు గురైంది. అదే విధంగా సూదిరెడ్డిపల్లె గ్రామంలోని రాంభూపాల్ చౌదరి నగర్‌లో వాటర్ ట్యాంక్‌కు నాలుగు కుళాయిలకు గాను ఒక్కటే పని చేస్తుందని కాలనీవాసులు తెలిపారు. దిగువపాడు ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంకు ఉన్న కుళాయిలు పనిచేయడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతోనే వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా మారుతున్నాయని గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచి నీటి ట్యాంకులు శుభ్రంగా ఉండేలా చూడాలని, మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఆర్డీఓ కార్యాలయం సమీపాన మరమ్మతులకు గురైన కుళాయి

డ్రగ్స్‌కు బానిస కావొద్దు

- మాదక ద్రవ్యాలపై ఎలాంటి సమాచారం ఉన్నా 1972 నంబరుకు కాల్ చేయండి
- చెమటోడ్చి సంపాదించిన డబ్బును కుటుంబానికి వినియోగించండి
- ఈగల్ ఎస్‌ఐ సుజన్‌కుమార్



అవగాహన పోస్టర్లను ప్రదర్శిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఈగల్ ఎస్‌ఐ సుజన్‌కుమార్ సూచించారు. ఆయన మంగళవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో హమాలీలు, కార్మికులు, డ్రైవర్లు తదితరులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై నిర్వహించిన సదస్సులో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు అలవాటు పడి సంతోషకరమైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రధానంగా కర్నూలు ప్రాంతంలో గంజాయి బెడద ఎక్కువగా ఉందని, ప్రతిఒక్కరూ గంజాయి, డ్రగ్‌కు దూరంగా ఉండాలన్నారు. గంజాయి పండించినా, అమ్మినా, సేవించినా, ఎగుమతి చేసినా, దిగుమతి చేసుకున్నా శిక్షార్హులేనని స్పష్టం చేశారు. గంజాయి గురించి ఎలాంటి సమాచారం ఉన్నా 1972 నంబరు కాల్ చేసి తెలియజేయాలన్నారు. చెమటోడ్చి సంపాదించిన డబ్బును కుటుంబం అభివృద్ధికి, పిల్లల చదువులకు వినియోగించాలని, డ్రగ్స్ కోసం ఖర్చు చేసి కుటుంబాలను వీధిన పడేసుకోవద్దని సూచించారు. ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ ఆదేశాల మేరకు మార్కెట్ యార్డులో అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల జోలికి వెళ్లబోమని కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ అలవాటు వల్ల కలిగే అనర్థాలను తెలిపే పోస్టర్లను విడుదల చేశారు. మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, టీజీవీ గ్రూపు ప్రతినిధి శేషగిరి శెట్టి, ఈగల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ పరేషాన్!



ఎల్లమ్మ ఆలయం వద్ద కేజీ రోడ్డుపై ఇరుపక్కలా నిలిపి ఉంచిన వాహనాలు

కర్నూలు(రూరల్): వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయానికి వచ్చిన వారు వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తుండటంతో భక్తులకు, ప్రయాణికులకు సమస్య ఏర్పడుతోంది. కర్నూలు -గుంటూరు ప్రధాన రహదారి (కేజీ రోడ్డు) పక్కనే ఆలయం ఉండటంతో ఎన్నో ఏళ్లుగా పార్కింగ్ సమస్య ఉంది. ప్రతి మంగళ, శుక్రవారం వేల సంఖ్యలో వాహనాల్లో భక్తులు ఆలయానికి వస్తుంటారు. గజిబిజిగా వాహనాల పార్కింగ్‌తో కేజీ రోడ్డుపై ప్రయాణికులకు, భక్తులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మంగళవారం, శుక్రవారాల్లో రద్దీ, గజిబిజి పార్కింగ్ వల్ల ఇక్కడ ట్రాఫిక్ జామ్ అవుతుంది. గత కొన్ని వారాలుగా తాలుకా అర్బన్ పోలీసులు ఇక్కడ ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. గతంలో ఈ రహదారిపై జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులు, జడ్జిలు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. రోడ్డుకు ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేసి ఉంచుతుండటంతో ఆలయానికి వచ్చే భక్తులు ఇక్కడ బస్సులు దిగేటప్పుడు, ఎక్కేటప్పుడు నడిరోడ్డుపై బస్సు నిలపాల్సి వస్తోంది. ఈ కారణంగా ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంది. ఇప్పటికైనా ఆలయ అధికారులు చర్యలు చేపట్టి పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని, ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపే వారిపై చర్యలు తీసుకొని ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని భక్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.



ఆలయ ప్రధాన ముఖద్వారం వద్ద గజిబిజిగా వాహనాల పార్కింగ్

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



ఒకవైపు వాలిన విద్యుత్ స్తంభాలు

కర్నూలు(రూరల్): కర్నూలు మండల పరిధిలోని పసుపుల నుంచి పి.రుద్రవరం గ్రామానికి వెళ్లే దారిలో దర్గా సమీపాన పొలంలో విద్యుత్ స్తంభాలు ఒకవైపునకు వాలిపోయి ఎప్పుడు పడిపోతాయో అన్నట్లుగా ఉన్నాయి. రోడ్డు పక్కనే స్తంభాలు ఉండటంతో ప్రస్తుతం వీస్తున్న ఈదురు గాలులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు.

నీటిని వృథా చేస్తే కుళాయి కనెక్షన్ కట్



బాపూజీ నగర్‌లో తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలో ఎవరైనా తాగునీటిని వృథా చేస్తే సంబంధిత గృహ, వాణిజ్య సముదాయ కుళాయి కనెక్షన్లు కట్ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. ఆయన మంగళవారం బాపూజీ నగర్, పాతబస్టాండ్, సి.క్యాంపు రైతుబజార్ ప్రాంతాల్లో పర్యటించారు. బాపూజీ నగర్‌లో డ్రైనేజీ కాల్వలో సిల్ట్ తొలగింపునకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే కొందరు తాగునీటిని వృథా చేయడాన్ని గమనించిన కమిషనర్ నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తాగునీటిని వృథా చేసే వారి కుళాయి కనెక్షన్లు కట్ చేయాలని అధికారులను ఆదేశించారు.

అన్న క్యాంటీన్ల పరిశీలన

నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి, కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న అన్న క్యాంటీన్లను కమిషనర్ పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి వినియోగదారులతో మాట్లాడారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్న క్యాంటీన్ నిర్వాహకులకు సూచించారు. ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, తనిఖీదారులు వలీ పాల్గొన్నారు.